లోక్‌సభ ఎన్నికలు..
గట్టి బందోబస్తు

● ఎన్నికల రిటర్నింగ్ అధికారి పోలీస్ సైదులు ● చెక్ పాయింట్ల వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తాం

కుత్బుల్లాపూర్: ఎన్నికల్లో ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా గట్టి బందోబస్తులో చెకింగ్ పాయింట్‌లను ఏర్పాటు చేసినట్లు కుత్బుల్లాపూర్ అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పోలీస్ సైదులు పేర్కొన్నారు. దుండిగల్ మున్సిపల్ పరిధిలోని గాగిల్లాపూర్, చింతల్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన వాహన చెకింగ్ పాయింట్లు గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పులి సైదులు మాట్లాడుతూ... అనుమానం ఉన్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి పంపించాలన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా 50వేలకు పైగా డబ్బులు ఉంటే వాటిని సీజ్ చేసి జిల్లా కార్యాలయంలో డిపాజిట్ చేయాలని కోరారు.



చెక్ పాయింట్ వద్ద ఎన్నికల అధికారులు, పోలీసులు

సీజ్ చేసిన డబ్బులు ఆధారాలు చూపించి తీసుకెళ్లాలి..

◆ ఎవరైనా 50 వేలకు పైగా డబ్బులు తీసుకుని ప్రయాణం చేస్తే వాటికి ఆధారాలు ఉంటేనే తీసుకువెళ్లాలని లేనిపక్షంలో వాటిని సీజ్ చేయడం తప్పదని హెచ్చరించారు. సీజ్ చేసిన డబ్బులను తిరిగి పొందాలంటే వాటికి సరైన ఆధారాలు జిల్లా త్రిష కమిటీ ముందు సమర్పించి తీసుకువెళ్లాలని తెలిపారు. ప్రతి పాయింట్ వద్ద ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో రెండు షిఫ్ట్‌ల వారీగా సిబ్బందిని నియమించి పనితీరు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే వారిపై శాఖ పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

మార్చి 31 లోపు పూర్తి చేయాలి...

◆ ఈనెల 31వ తేదీ లోపు 85 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వృద్ధులకు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఎన్నికల సంఘం కల్పించగా బూత్ లెవెల్ అధికారులు, సిబ్బంది వారికి 12బీ దరఖాస్తులను అందజేయాలని కుత్బుల్లాపూర్ అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 2060 మంది 85 సంవత్సరాలు నిండి ఉన్న వారికి అవకాశం కల్పిస్తూ పోస్టల్ బ్యాలెట్ పద్ధతిలో వీరు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంది. పోస్టల్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికల సిబ్బంది వృద్ధుల ఇంటికే వెళ్లి వారి ఓటును నమోదు చేసుకోనున్నారు. ఇదే విషయంపై గురువారం సర్కిల్ కార్యాలయంలో 582 మంది పోలింగ్ బూత్ ఏజెంట్లతో ప్రత్యేక సమావేశం అయ్యారు.



బూత్ లెవెల్ అధికారులతో సమావేశమైన అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు

ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

దుండిగల్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ సహాయ అధికారులు తెలిపారు. దుండిగల్ మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో గురువారం బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించారు. గండి మైసమ్మ–దుండిగల్ మండల తహసీల్దార్ సయ్యద్ అబ్దుల్ మతిన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీల కమిషనర్లు సత్యనారాయణ, శ్రీహరి హాజరయ్యారు. ఫారాలు–6, 8, 8ఏ, 7, 12ఈ లపై వివరించారు. కార్యక్రమంలో మేనేజర్ నర్సింహులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎన్నికల రిటర్నింగ్ సహాయ అధికారులు

'రాజకీయ కుట్రలో భాగంగా అనేక కేసుల్లో ఇరికిస్తున్నారు'

నిజాంపేట్ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి

నిజాంపేట్: రాజకీయ కుట్రలో భాగంగానే తనను అనేక కేసుల్లో ఇరికించారని నిజాంపేట్ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో జరిగిన ఓ కేసు విషయంతో పాటు ఇటీవల జరిగిన మరో కేసు విషయంలో తనను డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్‌ను టార్గెట్ చేస్తూ వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా జీవితంలో ఉంటున్న తమకు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు. కొంతమంది కావాలని తప్పుడు ప్రచారం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని.. వారిని ప్రజాక్షేత్రంలోనే ఎదుర్కొంటానని తెలిపారు. నిజానిజాలు త్వరలోనే వెలుగులోకి వస్తాయని తెలిపారు. తాము వ్యక్తిగతంగా ఎవరికి శత్రువులం కాదన్నారు. చేయని తప్పులకు తమను టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో తాము న్యాయ పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

పార్టీని నమ్ముకున్న వారికి ప్రాధాన్యం ఇవ్వాలి


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నేత జేమ్స్

కుత్బుల్లాపూర్: ఎన్నో ఏళ్లుగా పార్టీనే నమ్ముకున్న వారికి తగిన గుర్తింపు ఇవ్వాలని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ నేతలు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. రేవంత్‌రెడ్డి నివాసంలో గురువారం మల్కాజిగిరి పార్లమెంట్ స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఇందులో దళిత సంఘం నేత జేమ్స్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని కోరారు. ఎన్నికలు ముగిశాక అవకాశం కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు జేమ్స్ తెలిపారు.

సీఎస్ఐ సెంటర్ ప్రారంభం


సెంటర్ ప్రారంభోత్సవంలో డాక్టర్ ఏవీ కృష్ణప్రసాద్, కళాశాల చైర్మన్ లక్ష్మారెడ్డి, కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి

దుండిగల్: ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో టెక్ కనెక్ట్ పేరిట కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (సీఎస్ఐ) సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డితో కలిసి ఐఈటీఈ ఎగ్జిక్యూటీవ్ మెంబర్, కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా కార్యదర్శి డాక్టర్ ఏవీ కృష్ణప్రసాద్ గురువారం సీఎస్ఐ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, బ్లాక్ చైన్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి సీఎస్ఐ తోడ్పాటును అందిస్తుందన్నారు. సీఎస్ఐ నిర్వహించే వర్క్‌షాప్‌ల ద్వారా ప్రయోజనాలను పొందాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. అధునాతన సాంకేతికతను విద్యార్థులకు అందించేందుకు తమ కళాశాల ఎప్పుడు ముందంజలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ రాధికదేవి, సీఎస్ఈ హెచ్ఓడీ డాక్టర్ బలరామ్, హెచ్ఓడీలు సాయిప్రసాద్, రాజశేఖర్‌రెడ్డి, సుభాషిణి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా బాలిక అదృశ్యం


నైన్సీ (ఫైల్)

సుభాష్‌నగర్: అనుమానాస్పదస్థితిలో ఓ బాలిక కనిపించకుండాపోయిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం కాలనీకి చెందిన మనోజ్ కచ్వా స్థానికంగా కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. కాగా ఇతని చిన్న కుమార్తె నైన్సీ(16) ఈనెల 20న సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో అదే వీధిలో ఉంటున్న పెద్దనాన్న ఇంటికి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లింది. రాత్రి 8 గంటలైనా కుమార్తె ఇంటికి రాకపోయేసరికి కంగారు పడిన మనోజ్ తన అన్నకు ఫోన్ చేయగా అసలు రాలేదని చెప్పారు.

◆ ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా నైన్సీ ఆచూకీ తెలియరాలేదు. అయితే గతంలో రాజస్థాన్‌లోని నాగోర్‌లో నైన్సీని ప్రేమిస్తున్నానన్ని బన్సీలాల్ అనే యువకుడు వెంట పడేవాడని వారు తెలిపారు. ఈ విషయమై నాగోర్ పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. సదరు యువకుడే తమ కుమార్తెను తీసుకువెళ్లి ఉంటానని గురువారం సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం


జ్యోత్స్న (ఫైల్)

సుభాష్‌నగర్: అనుమానాస్పదస్థితిలో ఓ మహిళ అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా మామిడిపల్లి గ్రామానికి చెందిన అశోక్‌కుమార్ నెల రోజుల క్రితం నగరానికి ఉపాధి నిమిత్తం వచ్చాడు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఎన్‌మాక్స్ పరిశ్రమలో వెల్డర్‌గా పని చేస్తున్న అశోక్‌కుమార్ సూరారం కాలనీ సుభాష్‌చంద్రబోస్‌నగర్‌లో భార్య జ్యోత్స్న, తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. ఈనెల 18న ఉదయం డ్యూటీ నుంచి ఇంటికి రాగా భార్య కనిపించలేదు. చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లేకపోవడంతో గురువారం బాధిత కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోద చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సేంద్రియ ఎరువులను విరివిగా వాడాలి

కూరగాయల విభాగం శాస్త్రవేత్త కే నిరోషా

ఏజీవర్సిటీ: జాతీయ సేవా పథకంలో భాగంగా నాల్గోరోజు శంషాబాద్ మండల పరిధి మల్కారంలో ఉద్యాన శాస్త్రవేత్తలు, విద్యార్థులతో కలిసి పూలు, కూరగాయల పంటలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. రైతులు పండిస్తున్న కూరగాయలు, బెండ, టమాటా, గోరు చిక్కుడు, పాలకూర, మెంతికూర, పూదీనా, కొత్తిమీర, క్యాబేజీలలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, అనుసరించాల్సిన ఎరువుల యాజమాన్య పద్ధతుల గురించి కూరగాయల విభాగపు శాస్త్రవేత్త అసిస్టెంట్ ప్రొఫెసర్ కే నిరోషా రైతులకు తగిన సూచనలు చేశారు. ప్రధానంగా కూరగాయ పంటల్లో వచ్చే నూతన వంగడాలను ఆధునిక సాంకేతిక పద్ధతులను ఎప్పటికప్పుడు రైతులు తెలుసుకుని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని పేర్కొన్నారు. సరైన పద్ధతుల ద్వారానే అధిక దిగుబడిని పొందగలరన్నారు. కీటకాల్లో కూడా మిత్ర, శత్రు కీటకాలు ఉంటాయని వాటికి అనుగుణంగా ఎరువులను తగిన మోతాదులో వాడాలని వివరించారు. ముఖ్యంగా అధిక దిగుబడి కోసం సేంద్రియ ఎరువులను విరివిగా వినియోగించాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగామ్ అధికారులు సీఎస్ఆర్ సంతోషిని, లావణ్య, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమతులు లేని నిర్మాణాలకు అడ్డేది.?

ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న టీపీఓ అధికారులు


జీడిమెట్ల ఫేజ్-3లో ఓ షెడ్డు


సుభాష్‌నగర్ ఫేజ్-1లో బిల్డింగ్

జీడిమెట్ల: సుభాష్‌నగర్ డివిజన్‌లో అనుమతలు లేని బిల్డింగ్‌లు, షెడ్‌లు విచ్చలవిడిగా నిర్మిస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారుల అలసత్వంతో అనుమతలు లేని నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. ఓ వైపు కొత్తగా ఏర్పడిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆదాయాన్ని పెంచాలని అధికారులకు సూచనలు చేస్తున్నా అధికారులు మాత్రం ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే పనులను చేస్తున్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్‌లోని సుభాష్‌నగర్ డివిజన్‌లో అనుమతులు లేని మేడలు, పరిశ్రమల షెడ్‌లు వందల సంఖ్యలో నిర్మిస్తున్నారు. ఇప్పటికైనా అనుమతులు లేని నిర్మాణాలను అడ్డుకోకపోతే ప్రభుత్వ అధాయానికి భారీగా కోత పడకతప్పదు.

అధికారుల జేబులు ఫుల్.. ప్రభుత్వ ఆదాయం నిల్.!

◆ 9నెలలుగా టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో ఓ అధికారం చక్రం తిప్పుతున్నాడు. నాలుగు డివిజన్లలో ఏక ఛత్రాధిపత్యంగా కొనసాగుతూ అక్రమ కట్టడాలకు నేరుగానే సహకరిస్తున్నాడు. అక్రమ, అనుమతులు లేని నిర్మాణాలపై జీహెచ్ఎంసీ అధికారులకు స్థానిక ప్రజలు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం మాత్రం శూన్యమేనని ప్రజలు అంటున్నారు.

సుభాష్‌నగర్ డివిజన్‌లోనే అత్యధిక కట్టడాలు..

◆ డివిజన్‌లోని మోడీ బిల్డర్స్‌కు వెళ్లే దారిలో ఓ వ్యక్తి 2000 గజాల్లో షెడ్డును నిర్మిస్తున్నాడు. ఈ విషయమై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. సుభాష్‌నగర్‌లోని ఫేజ్–1లో నిర్మించిన ఓ బిల్డింగ్‌పై ఫిర్యాదులు అందాయి. అయినా అధికారుల్లో ఎలాంటి చలనం లేదు. ఇప్పటికైనా సదరు నిర్మాణాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

అనుమతి లేని ప్రైవేట్ స్కూల్ సీజ్



కుత్బుల్లాపూర్: అనుమతులు లేకుండా కొనసాగుతున్న ఓ ప్రైవేట్ స్కూల్‌ను విద్యాశాఖ అధికారులు సీజ్ చేశారు. సుచిత్రలోని శ్రీచైతన్య స్కూల్‌కు ఎటువంటి అనుమతులు లేకుండా నడుపుతున్నారని ఫిర్యాదులు రావడంతో బుధవారం జిల్లా విద్యాధికారి విజయకుమారి ఆదేశానుసారం మండల విద్యాధికారి ఆంజనేయులు పాఠశాలకు నోటీసులు అంటించారు. పాఠశాలకు సంబంధించి రికార్డులను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు బీవీఆర్ఐటీలో మేధాన్వేష్

నిజాంపేట్: బాచుపల్లిలోని బీవీఆర్ఐటీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 22న మేధాన్వేష్ 2కే24ను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎన్ సునీత ఓ ప్రకటనలో తెలిపారు. ఎలికో లిమిటెడ్ వైస్‌చైర్మన్ వనిత దాట్ల ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని అన్నారు. ఎస్వీఈఎస్ వైస్‌చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, సెక్రటరీ ఆదిత్యలు పాల్గొనున్నారని పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు కళాశాల సెమినార్ హాల్‌లో మేధాన్వేష్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

చౌరస్తాలు, ఖాళీ ప్రదేశాల్లో ఆక్రమణలు

అక్రమంగా టీస్టాళ్లు, పాన్ డబ్బాల ఏర్పాటు

రంగారెడ్డినగర్: సర్కిల్ కిందిస్థాయి సిబ్బంది చేతివాటం ప్రదర్శించడంతో ప్రధాన చౌరస్తాలు, ఖాళీ ప్రదేశాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఐడీపీఎల్ చౌరస్తాలను ఇటీవలే కోట్లాది నిధులు వెచ్చించి విస్తరించి సుందరీకరించారు. ఈ నేపథ్యంలో రోడ్డుపై వెలిసిన పలు డబ్బాలను అధికారులు తొలగించారు. అయితే ఇటీవల ఐడీపీఎల్ చౌరస్తాలో ఒక్కొక్కటిగా అక్రమ డబ్బాలు వెలుస్తున్నాయి. ఓ వ్యక్తి టీస్టాల్‌ను ఏర్పాటు చేయగా ఇప్పటి వరకు అధికారుల నుంచి ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. కింది స్థాయి సిబ్బంది నెలవారీ వసూళ్లకు పాల్పడుతూ డబ్బా విషయంలో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నా ఆరోపలు వినిపిస్తున్నాయి. అక్రమణలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే గతంలో మాదిరిగా సుందరీకరించిన ప్రాంతాల్లో డబ్బాలు వెలిసే ఆస్కారముందని పలువురు పేర్కొంటున్నారు.



ఐడీపీఎల్ చౌరస్తాలో అక్రమంగా వెలిసిన డబ్బా

డ్రైనేజీ ఔట్‌లెట్ సమస్య పరిశీలన

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ ప్రగతి నగర్ ఆనుకుని ఉన్న ఇన్‌కాయిస్ నుంచి వచ్చే డ్రైనేజీ ఔట్‌లెట్ విషయమై పలు శాఖ అధికారులు పరిశీలించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి దృష్టికి స్థానికులు డ్రైనేజీ ఔట్‌లెట్ సమస్య తీసుకెళ్లడంతో గురువారం వాటర్ వర్క్స్, జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులను అక్కడికి రప్పించి సమస్యను వివరించారు. గతంలో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే డ్రైనేజీ వాటర్ దిగువ ప్రాంతానికి వెళ్లేదని, ప్రస్తుతం సర్వే నం.307 కబ్జాలతో నాలా కనుమరుగై ప్రస్తుతం ఇన్‌కాయిస్ డ్రైనేజీ నీరు వెళ్లడంతో దిగువ ప్రాంతానికి వెళ్లడానికి స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీధర్‌రెడ్డి, కళ్యాణ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మోడ్రన్ ఫంక్షన్‌హాల్‌కు రక్షణ కరువు


భగత్‌సింగ్‌నగర్‌లోని మోడ్రన్ ఫంక్షన్‌హాల్‌లో కుళాయిల నల్లాలను ఎత్తుకెళ్లిన దృశ్యం

చింతల్: చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లో సుమారు రూ.4.5కోట్ల నిధులతో ఏర్పాటు చేసిన మోడ్రన్ ఫంక్షన్‌హాల్‌కు రక్షణ లేకుండాపోయింది. ఇటీవల మోడ్రన్ ఫంక్షన్‌హాల్‌లో దొంగలు పడి కుళాయిలకు అమర్చిన నల్లాలను ఎత్తుకెళ్లారు. కల్యాణ మండపం అందుబాటులోకి రాకముందే ఇలా జరగడంతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. కోట్లాది నిధులు వెచ్చించిన కల్యాణ మండపానికి కనీసం సెక్యూరిటీ సిబ్బందిని నియమించకపోవడంతో స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అదే విధంగా కుళాయిల వద్ద ఉన్న మార్బుల్స్ బండలను సైతం దొంగలు ఎత్తుకుపోవడం విశేషం. ఇకనైనా అధికారులు కళ్లు తెరవకుంటే కల్యాణ మండపంలోని ఎలక్ట్రికల్ పరికరాలను సైతం ఎత్తుకెళ్లే ఆస్కారముందని స్థానికులు పేర్కొంటున్నారు.

జాతీయ పార్టీలకు బుద్ధి చెప్పాలి

• బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పరిచయ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
• రాగిడి లక్ష్మారెడ్డిని మల్కాజిగిరి ఎంపీగా గెలిపించాలని నేతలకు ఆదేశం


రాగిడి లక్ష్మారెడ్డిని సత్కరిస్తున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్, నాయకులు

దుండిగల్: కొడంగల్‌లో ఓడిపోయి మల్కాజిగిరిలో గెలిచిన రేవంత్‌రెడ్డి ఇక్కడ చేసిందేమి లేదని... హుజూరాబాద్‌లో ఓడిన ఈటల రాజేందర్ ఇక్కడ గెలిచినా చేసేదేమి ఉండదని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ విమర్శించారు. గండిమైసమ్మలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్ హాజరై పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో వ్యవహరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారని... సాధ్యం కాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ నేతలు కుర్చీలను కాపాడుకోవడానికే సమయం సరిపోవడం లేదన్నారు. కాంగ్రెస్ చరిత్రలో ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పని చేసే నాయకుడు ఒక్కడు లేడని విమర్శించారు. పదేళ్లల్లో బీజేపీ ఆయా రాష్ట్రాల్లో పది ప్రభుత్వాలను కూల్చిందన్నారు. తమ స్వార్థం చూసుకునే జాతీయ పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. ప్రజా సంక్షేమం కోసం పనిచేసే బీఆర్ఎస్ పార్టీని ఆదరించాలని కోరారు.

◆ రాష్ట్రంలోనే కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రజలు 85,576 ఓట్ల భారీ మెజార్టీని అందించి రికార్డు సృష్టించారని అన్నారు. దీనిని జీర్ణించుకోలేని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ కార్యకర్తలపై బెదిరింపులకు దిగుతున్నాయని... కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి విజయానికి కష్టపడి పనిచేయాలన్నారు.


దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

మల్కాజిగిరిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా...

◆ అనంతరం ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... 20 ఏళ్లుగా మధుర ట్రస్ట్ ఆధ్వర్యంలో బస్తీలు, కాలనీల్లో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు చేరువయ్యానని అన్నారు. తనను ఆశీర్వదించి గెలిపిస్తే మల్కాజిగిరిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అంతక ముందు సూరారం కట్ట మైసమ్మ, దుండిగల్‌లోని సింగాపురం మైసమ్మ దేవాలయాల్లో ఎమ్మెల్యే వివేకానంద్, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుపై అంతర్జాతీయ వర్క్‌షాప్

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ సంస్థ (ఎన్ఐఆర్‌డీపీఆర్)లో గురువారం కృత్రిమ మేధస్సుపై అంతర్జాతీయ స్కాపింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. దీనిలో వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ, ప్రాథమిక విద్య పథకం అమలు, ఆడిట్‌పై చర్చించారు. యూఎస్ఏ, బెల్జియంతో పాటు భారతదేశానికి చెందిన విద్యావేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులతో సహా జాతీయ అంతర్జాతీయ నిపుణులు పాల్గొన్నారు. ఎన్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ నరేంద్రకుమార్, అదనపు కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులున్నారు.

నేడు పశుపోషణపై సదస్సు

ఏజీవర్సిటీ: పీవీ నరసింహరావు పశువైద్య విశ్వవిద్యాలయం, భారత జాతీయ ఉత్పాదక మండల ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన సుస్థిర పాడి పశువుల ఉత్పాదకత సమగ్ర పశుపోషణ యాజమాన్య పద్ధతి అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు పశు సంవర్ధక విస్తరణ విభాగం అధికారి సత్యనారాయణ తెలిపారు. సుస్థిర పశు ఉత్పాదకతపై వివిధ అంశాలపై లోతైన పరిశోధన, మేధోమదనం, ఉత్పాదకత పశు సంక్షేమం అనే అంశాలపై చర్చ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

అక్రమంగా తరలిస్తున్న 796 లీటర్ల మద్యం పట్టివేత

కుత్బుల్లాపూర్: పోలీసులు బెల్టుషాపులపై మెరుపు దాడులు చేశారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎస్ఓటీ బృందాలు బెల్టు షాపులపై విరుచుకుపడ్డాయి. 8 పోలీస్ స్టేషన్ల పరిధిలో దాడులు నిర్వహించి అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన 796 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.7,47,368 ఉంటుందని పోలీసులు తెలిపారు. అత్యధికంగా పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తుండగా వలపన్ని ఏకంగా 480 లీటర్ల మద్యాన్ని మేడ్చల్ టీమ్ పట్టుకుంది. అదే విధంగా మోకిలా పోలీస్ స్టేషన్ పరిధిలో 45.2, రాజేంద్రనగర్‌లో 94.78, శామీర్‌పేట్‌లో 11.25, బాచుపల్లిలో 55.8, మైలార్‌దేవ్‌పల్లిలో 17.4, నందిగామలో 19.14, దుండిగల్‌లో 6.43 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

బయటకి వెళ్లొచ్చే సరికి ఇల్లు గుల్ల

జగద్గిరిగుట్ట: ఇంటి తాళం పగులగొట్టి రూ.4 లక్షల నగదు, 18 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటన జగద్గిరిగుట్ట పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లమ్మ బండ జన్మభూమి కాలనీకి చెందిన మక్సూద్ కుటుంబంతో సహా ఈనెల 17న ఉప్పల్‌లో బంధువుల వివాహానికి వెళ్లారు. తిరిగి బుధవారం రాత్రి 9.30 గంటలకు వచ్చి చూడగా ఇంటి తాళం పగల కొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రూ.4లక్షల నగదు, 18 తులాల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి ఈ మేరకు బాధితుడు జగద్గిరిగట్టు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




ఇంట్లో చిందర వందరగా పడివున్న వస్తువులు